క్లుప్తంగా

నేడు మందసలో జానపద కళారూపాల ప్రదర్శన

మందస: గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా మందస పట్టణంలో సోమవారం జానపద కళారూపాలను ప్రదర్శిస్తున్నట్లు వి.వి.రమణ మూర్తి, గిన్ని తిరుపతిరెడ్డి, ఇప్పిలి వెంకటేశ్వర రావు, కిల్లం వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలి పారు.జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు ఆధ్వర్యంలో తప్పెటగుళ్లు, జము కుల పాట, ఎరుకుల పాట, సన్నాయి, డప్పులు, పగటివేషాలు జరుగుతాయని పేర్కొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా శరత్‌బాబు


తుంగాన శరత్‌బాబు

కవిటి: జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కవిటి పట్టణానికి చెందిన తుంగాన శరత్‌బాబు ఖేలో ఇండియా షటిల్ బ్యాడ్మింటన్ జాతీయస్థాయి పోటీలకు అంపైర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం కవిటిలో జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది తమరాల జయరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 3 వరకు ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరగనున్న జాతీయస్థాయి ఖేలో ఇండియా పోటీలకు శరత్ బాబు ఎంపిక కావడానికి కృషిచేసిన రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు, జిల్లా సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కొండపోలమ్మ సంబరం


గజముద్దతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం పరిధిలోని 20వ వార్డు కొండపోలమ్మ కాలనీ వద్ద కొలువైన కొండపోలమ్మ అమ్మవారి సంబరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపంగా చేసిన గజముద్దతో మేళతాళాలతో తిరువీధి చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రచార విభాగ కమిటీ జిల్లా అధ్యక్షుడు తాడి ఆదిరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుకన్య

ఇచ్ఛాపురం: మహిళలంతా రుతుచక్రం జరిగే సమయాలో తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఇచ్ఛాపురం యూహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సుకన్య సూచించారు. పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో మహిళా సంఘం సభ్యులతో ఆదివారం మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ రుతుచక్ర పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. భద్రత, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, మహిళాసంఘం సభ్యులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై నేడు నిరసన

టెక్కలి: పేదలకు ఇళ్ల పట్టాలపై టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం టెక్కలిలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకురాలు దువ్వాడ వాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ దుర్మార్గపు చర్యలను ప్రజలకు వివరించేలా సాయంత్రం 4 గంటల నుంచి పట్టణంలో నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

టెక్కలి: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆశా వర్కర్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు కె.నాగమణి డిమాండ్ చేశారు. ఆదివారం టెక్కలిలో నియోజకవర్గ స్థాయిలో ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఎటువంటి వేధింపులు లేకుండా, ప్రభుత్వ పథకాలు వర్తించేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు ధనలక్ష్మి, ఎన్.షణ్ముఖరావు, విజయ, కుంతి, సుజాత, అన్నపూర్ణ, ఉమా, ఈశ్వర్రావు పాల్గొన్నారు.

సమైక్యతకు ప్రతిరూపాలు క్రీడలు


బ్యాటింగ్ చేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- రట్టిలో ముగిసిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

మందస: క్రీడలు సమైక్యతకు ప్రతిరూపాలని రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన భేతాళపురం పంచాయతీ రట్టిలో నెల రోజులుగా జరుగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ క్రీడలు స్నేహపూరిత వాతావరణంలో జరగాలన్నారు. రట్టి గ్రామం అందరికీ ఆదర్శమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న క్రీడా పోటీలు మైత్రికి వారధుల్లా పని చేస్తాయన్నారు. యువత అంకితభావం, పోటీతత్వంతో పని చేయాలన్నారు. ఉద్దాన పరిస్థితుల్లో మార్పు వచ్చిందని, ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దుతున్నారని చెపఆపరు. రట్టి గ్రామ యువకులు ఎవరిపై ఆధారపడకుండా రెండేళ్లు కష్టపడి.. ఏకంగా క్రీడా మైదానాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. దేహ దారుఢ్యానికి, ఆరోగ్యానికి క్రీడలు తప్పనిసరని, ఆర్మీ, పోలీసు వంటి ఉద్యోగాలకు కూడా దోహదపడతాయని చెప్పారు. అంతకుముందు మంత్రి కాసేపు బ్యాటింగ్ చేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన రంగనాథపురం, ఎగువూరు జట్లకు ట్రోఫీ, నగదు, బహుమతులను అందజేశారు. వివేకానంద యువజనసేవా సంఘం, గ్రామపెద్దలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, సర్పంచ్ మామిడి సింహాద్రి, ఎంపీటీసీలు సూరాడ వాసు, తెప్పల ఉమాపతి, డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మణ్, గ్రామ పెద్ద కంసు కృష్ణమూర్తి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన కార్యదర్శి రాపాక శేషగిరిరావు, జాయింట్ కార్యదర్శి పులారి కూర్మారావు, రాంపురం సర్పంచ్ పొట్టి ధర్మారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పులారి పితాంబరం, పులారి తవిటయ్య, కొల్లి మోహనరావు, మామిడి భగీరథి, సారథి దూర్వాసులు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు

పలికల సేవలు చిరస్మరణీయం

కంచిలి: మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, దివంగత నేత పలికల భాస్కరరావు మండలాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. జాడుపూడిలో భాస్కరరావు విగ్రహాన్ని చైర్‌పర్సన్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కరరావు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ పలికల దాక్షాయిని, ఎంపీటీసీ జామిజయ, పార్టీ నాయకులు జయరాం, కొనపల సురేష్, దుర్గాసి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.


భాస్కరరావు విగ్రహాన్ని ఆవిష్కరించిన జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

వంతెన పనులు చేపట్టాలి


మంత్రికి సమస్యలు వివరిస్తున్న సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం: నియోజకవర్గంలో అనుమతులు పొందిన ఐదు వంతెనల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించేలా చూడాలని సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడును విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో పీఎంజీఎస్వై పథకం ద్వారా అనుమతులు పొందిన ఐదు వంతెనల నిర్మాణాలను వివరించారు. ఆర్థికపరమైన అనుమతులు ఇవ్వాలని కోరారు.

నాయీబ్రాహ్మణులు సంఘటితం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆర్.అరవింద్

టెక్కలి: జిల్లాలో నాయీబ్రాహ్మణులంతా సమస్యలను పరిష్కరించుకునే విధంగా సంఘటితం కావాలని ప్రముఖ వైద్యుడు ఆర్.అరవింద్ కోరారు. టెక్కలి డివిజన్ పరిధిలోని నాయీబ్రాహ్మణులతో ఆదివారం పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నాయీబ్రాహ్మణులు అణచివేతకు గురయ్యారని, ప్రస్తుత ప్రభుత్వం చిత్తశుద్ధిగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఇటువంటి తరుణంలో మరి కొన్ని శాశ్వతమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించుకునేలా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి మండల కేంద్రంలో సామాజిక భవనాలు, గ్రామీణ ప్రాంతాల్లో నాయీబ్రాహ్మణుల వృత్తికి అవసరమైన షెడ్లు, జిల్లాలో సంగీత కళాశాల తదితర సమస్యలను ప్రభుత్వానికి నివేదించాలన్నారు. దీనిలో భాగంగా జూన్ 27న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నాయీబ్రాహ్మణ చైతన్య వేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా, డివిజన్ నాయకులు కె.గజపతిరావు, ఆర్.కృష్ణారావు, వెంటేశ్వర్లు, టి.కర్రెన్న, శంకరరావు, సీహెచ్.జగదీష్, పాపారావు, రమణమూర్తి, అమ్మోజీరావు, రామారావు, వెంకటరావు, ధర్మారావు, కృష్ణారావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి


పనులు చేయిస్తున్న కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్

పలాస: వార్డుల్లోని శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచాలని పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 17వ వార్డు కౌన్సిలర్, కార్మిక సంఘాల నాయకుడు దువ్వాడ శ్రీకాంత్ కోరారు. కొన్ని వారాలుగా కాలువలను శుభ్రం చేయకపోవడంతో ఆదివారం వార్డు పరిధిలోని సాయికాలనీలో పారిశుద్ధ్య పనులు చేయించారు. కాలువల్లో పూడికలు, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోతే వర్షాకాలంలో వ్యాధులు వ్యాప్తి చెందుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

కృష్ణదాస్‌ను కలిసిన దువ్వాడ వాణి


వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాసును కలిసిన దువ్వాడ వాణి, నాయకులు

టెక్కలి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాసును టెక్కలి నియోజకవర్గ నాయకురాలు దువ్వాడ వాణి ఆదివారం మబుగాంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయ కేతనం ఎగిరేలా కార్యకర్తలంతా సమన్వయంతో పని చేయాలని కృష్ణదాస్ కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, నాయకులు టి.జానకిరామయ్య, పి.రవికుమార్‌రెడ్డి, కె.ధర్మారావు, ఎస్.రామిరెడ్డి, జి.మోహన్‌రెడ్డి, బి.ఉదయ్, పి.శ్రీనివాస్,ఆర్.మురళి, కె.కామేష్, ఎస్.శంకర్, కె.అప్పన్న, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాలపోలమ్మ గ్రామదేవత ఉత్సవం


ఉత్సవ విగ్రహాలను తీసుకువస్తున్న మహిళలు

వజ్రపుకొత్తూరు: పాతటెక్కలి పంచాయతీ లింగాలపాడులో పాలపోలమ్మ గ్రామదేవత ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నాయనోరు ఇంటి నుంచి మేళతాళాలతో ఉత్సవ విగ్రహాలను గ్రామంలోకి తీసుకొచ్చారు. మహిళలు ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీఠంపై కూర్చోబెట్టారు. మూడు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయని, పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనం


ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

కంచిలి: మండలంలోని పెద్ద శ్రీరాంపురం ఉన్నత పాఠశాలలో 2001–2002 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు, 2002–03 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో వేర్వేరుగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలు ఒకరితో ఒకరు పంచుకున్నారు. పాఠాలు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి ఎస్.శివరాంప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది ,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కవిటి: మండలంలోని బొరివంక, రాజపురం, ఆర్.భైరిపురం, ఆర్.బెలగాం, కవిటి గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు మే 29 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. బొరివంకకు ఎస్సీ(స్త్రీ), మిగిలిన చోట్ల జనరల్(ఆల్)కేటగిరీ అభ్యర్థులు దరఖాస్తులు చేయాలని సూచించారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం


భూమిపూజ నిర్వహిస్తున్న ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి

కంచిలి: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. పురుషోత్తపురం పంచాయతీ ఆర్.గెద్దలపాడులో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కాంక్రీట్ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఎంపీపీ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సమస్యలు పరిష్కరించడానికి గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తులసీ మోహన్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డు కేశవ్ పాత్రో, జేసీఎస్ కన్వీనర్ కొనపల సురేష్, బొగాబెణి, కొల్లూరు సర్పంచ్‌లు గణప సింహాచలం, పైల లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్

కంచిలి: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమం అందజేయడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. కంచిలి-1 సచివాలయం పరిధిలో ఆదివారం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల హామీలు నెరవేర్చి మీ ముందుకు వచ్చామని తెలిపారు. సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో రాష్ట్ర భవిష్యత్ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన చైర్మెన్ దుక్క లోకేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రాందాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ మాష్టీల మంజు, పార్టీ నాయకులు లడ్డుకేశవ్ పాత్రో, యారాడి ఆనంద్, డొక్కరి దాలయ్య, గొనప సింహాచలం, దుర్గాసి మోహనరావు, బృందావన్ బిసాయి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శతజయంతి ఉత్సవాలు

విజయవంతం చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న పిరియా విజయ, పేరాడ తిలక్, నర్తు రామారావు, సాయిరాజ్

సోంపేట: దివంగత పార్లమెంటేరియన్ బొడ్డేపల్లి రాజగోపాలరావు శతజయంతి ఉత్సవాలు విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నిర్వహించే శతజయంతి ఉత్సవాల నిర్వహణపై పార్టీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి ఆదివారం సోంపేటలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ శతజయంతి ఉత్సవాలను ప్రభుత్వ పరంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాకుళం పార్లమెంటు స్థానానికి ఆరుసార్లు ఎంపీగా ప్రాతినిధ్యం వహించి రాజగోపాలరావు రికార్డు సృష్టించారని గుర్తు చేశారు. జిల్లా సమస్యలు పరిష్కరించడంలో ముందు వరుసలో ఉన్నారని పేర్కొన్నారు. వాడవాడలా ఉత్సవాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్, ఎంపీపీ నిమ్మన దాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్, రౌతు విశ్వనాథం, కవిటి వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, ఏఎంసీ చైర్మన్ ఎస్.బాబూరావు, పిన్నింటి తిలక్, మూల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి : జిల్లా సస్యశ్యామలం కావడంలో కీలక పాత్ర పోషించిన దివంగత మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు గురించి భావితరాలకు తెలియజేసేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దివంగత మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ఉత్సవం నేపథ్యంలో ఆదివారం టెక్కలిలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ నేతృత్వంలో నియోజకవర్గ నాయకురాలు దువ్వాడ వాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ముందుగా బొడ్డేపల్లి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ జిల్లాకు ఆయన చేసిన సేవలకు గుర్తుగా ఈ నెల 30న శ్రీకాకుళంలో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు.

నియోజకవర్గ నాయకురాలు దువ్వాడ వాణి మాట్లాడుతూ బొడ్డేపల్లి శత జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వ పరంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో టెక్కలి, నందిగాం ఎంపీపీలు ఎ.సరోజనమ్మ, ఎన్.శ్రీరామ్మూర్తి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి జెడ్పీటీసీలు పి.వసంత్‌రెడ్డి, డి.వెంకట్రావు, కళింగ కార్పొరేషన్ డైరక్టర్ ఎస్.హేమసుందర్‌రాజు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు టి.జానకిరామయ్య, సత్తారు సత్యం, ఎ.రవిబాబ్జీ, హెచ్.ఉదయ్‌భాస్కర్, కె.మధు, టి.కిరణ్, టి.ధర్మారావు, ఎస్.వెంకటరమణ, కె.గోవింద్, కె.రామరాజు, కె.బాలకృష్ణ, ఆర్.మల్లయ్య, టి.బి.జి.గుప్తా, పి.వెంకట్రావు, ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


టెక్కలి: మాట్లాడుతున్న మాజీ కేంద్ర మంత్రి కృపారాణి, పక్కనే తిలక్, వాణి తదితరులు

సంక్షిప్తంగా..

ఘనంగా అసిరితల్లి సంబరాలు

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచిలో గ్రామ దేవత అసిరమ్మతల్లి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారిని ప్రత్యేక జంగిడిలో మేళతాళాలు మధ్య భక్తులు ఊరేగించారు. ఈ సందర్భంగా కాంతారా, భద్రకాళీ, ఒడిశా గారడీ, విశాఖపట్నం కోలాటం, డప్పుల నృత్యం, బిందెల నృత్యాలు ఆహూతుల్ని విశేషంగా అలరించాయి.

పెద్దబొడ్డపాడులో కాళీమాత ఉత్సవాలు

వజ్రపుకొత్తూరు రూరల్: పెద్దబొడ్డపాడులో కాళీ మాత గ్రామదేవత ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా కొండవూరు సమీపంలోని గట్టు పోలమ్మ ఆలయానికి మహిళలు, గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి దేవరను గ్రామంలోకి తీసుకురావడంతో ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. పెద్ద రైతు దుంపల నారాయణ ఇంటి వద్ద అమ్మవారి ప్రతిమలను కొలువుదీర్చారు. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, పగటి వేషాలు, జానపద నృత్యాలు ఉంటాయని కమిటీ సభ్యులు, యువజన సంఘం ప్రతినిధులు తెలిపారు.

30న కొత్తమ్మతల్లి ఆలయంలో ప్రవచనాలు

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయంలో ఈ నెల 30న విజయవాడ భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామీజీచే అనుగ్రహ భాషణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓ వాచకచర్ల రాధాకృష్ణ, కమిటీ చైర్మన్ బోయిన మాధవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని కోరారు.

నిరుపేద కుటుంబానికి సాయం



వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని చినవంక గ్రామానికి చెందిన కంసు భువనేశ్వరి కుటుంబానికి ఇల్లు లేకపోవడంతో మైటీ సంస్థ ప్రతినిధులు ఆదివారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. భువనేశ్వరి తుఫాను భవనంలో తలదాచుకోవడంతో చిన్న రేకులషెడ్ నిర్మించి ఇచ్చినట్లు సంస్థ అధ్యక్షుడు కోటిపల్లి రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో మైటీ సంస్థ ప్రతినిధులు జ్యోతి, సీత, సతీష్, అఖిల్, నీలకంఠం, ప్రసాద్ పాల్గొన్నారు.

మృత్యుంజయ ఫౌండేషన్ సాయం



ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని లొద్దపుట్టి గ్రామానికి చెందిన కొంతాల కేశవరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబం కావడంతో సవరదేవిపేటకు చెందిన మృత్యుంజయ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం బాధితుడి నివాసానికి వెళ్లి రూ.7వేలు అందజేశారు.

కళాకారులను ప్రోత్సహించాలి



సోంపేట: కళలను కాపాడుతున్న కళాకారులను ప్రోత్సహించాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. బెంకిలి గ్రామంలోని ఉమామహేశ్వర ఆలయం ఆవరణలో మండల కళాభారతి సంక్షేమ సమాఖ్య ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కళాకారులచే ఏర్పాటు చేసిన కచేరి శ్రోతలను మంత్ర ముగ్ధులను చేసింది. అనంతరం కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సింహాచలం పాడి, ఎర్ర గాంధీ, నిమ్మన పార్వతీశం, దేవేంద్రనాథ్ పండా, తామాడ చంద్రశేఖర్, సాహుకారి జానీ, శివాజీ పాణిగ్రాహి, జిణగ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 19వ వార్డు సూదికొండ కాలనీలోని జంగాల వీధిలో ఆదివారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో కొద్దినెలలుగా లోవోల్టేజీ సమస్య వేధిస్తోంది. ఈ విషయమై కౌన్సిలర్ శిష్టు బృందావతి వినతి స్వీకరించిన మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదేశాల మేరకు పలాస విద్యుత్ సబ్ స్టేషన్ అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ నాగభూషణరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధికార ప్రతినిధి శిష్టు గోపి, సీపాన లోకేష్, తంగుడు కామరాజు, మార్పు చిన్న, వలంటీర్ కోనారి ఆది, ప్రభావతి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.